క్లుప్తంగా

రహదారి ఆక్రమణలపై ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ప్రధాన రహదారి ఆక్రమణలపై కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీకి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ శనివారం ఫిర్యాదు చేశారు. భాస్కర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల కారణంగా దారి కుంచించుకుపోయినట్లు వెల్లడించారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని ఆరోపించారు. ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని, వెంటనే ఆక్రమణలు తొలగింపునకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి పరదేశి, పార్టీ మండల అధ్యక్షుడు హుమేష్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన


పశు వైద్య శిబిరం

నింద్ర: పశు వైద్య శిబిరాల ద్వారా ప్రతి గ్రామంలో పాడి రైతులు తమ పశువులకు వైద్య సేవలు పొందాలని అరూరు పశు ఉప కేంద్రం వైద్యాధికారి ప్రభాకర్‌వర్మ అన్నారు. మండలంలోని మేళంబాకం, కాన్నికాపురం గ్రామంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వైద్య సేవలు నిర్వహించడంతో పశువులకు వివిధ రోగాలను నయం చేయవచ్చునని అన్నారు. అదేవిధంగా వివిధ రోగాలను అరికట్టేందుకు పాడి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయికుమార్

నగరి: మండలంలోని రామాపురం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయికుమార్(38) అనే వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిరుపతికి చెందిన సాయికుమార్ నగరికి స్కూటీలో బయల్దేరాడు. మార్గమధ్యలో రామాపురం వద్ద చెన్నై నుంచి తిరుమలకు వెళుతున్న కారును అదుపు తప్పి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సాయికుమార్ తీవ్ర గాయాల పాలయ్యాడు. స్పందించిన స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు న్యూరో ఆస్పత్రికి తరలించారు.

అంగన్‌వాడీ తోట

SUNDAY SPECIAL

- అంగన్‌వాడీ ప్రాంగణంలోనే తోటల పెంపకం
- సేంద్రియ పద్ధతిలో తోట సాగు
- విద్యార్థులకు పోషకాలతో కూడిన భోజనం
- ఆదర్శంగా శ్రీహరిపురం అంగన్‌వాడీ సెంటర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలతో పౌష్టికాహారం అందించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇదే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'పోషణ వాటిక' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది శ్రీహరిపురం అంగన్ వాడీ కేంద్రం. పిల్లలకు ఆహారం అందించ దానికి అవసరమైన ఆకుకూరలు, కూరగాయలు కేంద్రం ఆవరణలోనే సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

విజయపురం: అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాల్లో కూరగాయల మొక్కలు పెంచి విద్యార్థులకు పోషకాహారం అందించాలంటూ పోషణ వాటిక పేరిట కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాన్ని మండలంలోని శ్రీహరిపురం అంగన్‌వాడీ సెంటర్ నిర్వాహకులు తూచా తప్పకుండా పాటిస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న భూమిని సాగు చేసి అందులో సేంద్రియ పద్ధతుల్లో తోటకూర, పాలకూర, కొత్తిమీర తదితర ఆకుకూరలు, వంకాయ, మిరప, టమాటా, బీర, బెండ, బీన్స్, మునగ వంటి కూరగాయలు పండిస్తున్నారు. మొక్కలకు రక్షణగా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారు. పంటను పశువులు మేయకుండా రక్షణ కల్పించుకున్నారు. రోజూ చిన్నారులకు మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాల్సిన పౌష్టికాహారానికి తాము పండించిన పంటలనే వాడుకుంటున్నారు. అంగన్‌వాడీ సెంటర్ వద్ద తోటలను చూసిన వారు ఆశ్చర్యానికి గురవుతున్నారు.


సాగు చేసిన కూరగాయల తోటలో టీచర్, చిన్న పిల్లలు


కూరగాయలు కోస్తున్న సిబ్బంది

పౌష్టికాహారం కోసమే 'పోషణ వాటిక'

పౌష్టికాహారం అందించడానికి ఏర్పాటు చేసిన పోషణ వాటిక కార్యక్రమంలో ఒక్కో అంగన్ వాడీ కేంద్రానికి రూ.10 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని అంగన్‌వాడీ సెంటర్‌ల వద్ద కూరగాయలు, ఆకుకూరల పెంపకానికి వాడుకోవాలి.

ఇక్కడే పండిస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలం సాగు చేశాను. ఆకు కూరలు, కూరగాయల మొక్కలు పెంచుతున్నాం. తాజా ఆకు కూరలను కేంద్రంలోని పిల్లల కోసం వినియోగిస్తున్నాం. ఏ రోజుకు అవసరమైన వాటిని ఆరోజే కోసుకుంటాం. కేంద్రలోనే సాగు చేసి పండించడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. ఎటువంటి తెగుళ్లు సోకకుండా సేంద్రియ పద్ధతులను పాటిస్తున్నాం.

–సుజాత, అంగన్‌వాడీ టీచర్, శ్రీహరిపురం, విజయపురం

ఎంపికైన ప్రతి కేంద్రంలోనూ సాగు



పోషణ వాటిక కింద ఎంపికైన ప్రతి కేంద్రంలో ఆకు కూరలు, కూరగాయల తోటలు సేంద్రియ ఎరువులతోనే సాగు చేయాలి. ఆయా గ్రామాల్లోని మహిళలు వాటిని చూసి ఇళ్ల వద్ద సొంతంగా పెరటి తోటల పెంపకం చేపట్టాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తోటలు పెంచే కార్యక్రమాన్ని మరింత విస్తరింపచేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

–లక్ష్మి, సూపర్‌వైజర్, విజయపురం

ఆరోగ్యకరమైన ఆహారం అందాలి

క్రిమిసంహారకాలు లేకుండా సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలను అప్పటికప్పుడు కోస్తాం. విద్యార్థులకు అందించడం ద్వారా వారికి పోషకాలు ఎక్కువగా అందుతాయి. ఆరోగ్యంగా ఉంటారు. నగరి నియోజకవర్గంలోని విజయపురం, నగరి, పుత్తూరు, నింద్ర, వడమాలపేట మండలాల్లో మొత్తం 109 అంగన్ వాడీలు పోషణ వాటిక కింద ఎంపికయ్యాయి.

–కృష్ణవేణి, సీడీపీఓ, నగరి

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నింద్ర: వరి, వేరుశనగ పంటలకు ఆశించే చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. శనివారం మండలంలోని కావునూరు, కొప్పేడు గ్రామల్లో వేరుశనగ, వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ కోసం తప్పనిసరిగా పురుగు మందులు పిచికారీ చేయాలని కోరారు. వేరుశనగ పంటలకు ఆశించిన పచ్చపురుగు, లద్దె పురుగుల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

ఇసుక డంప్ సీజ్


తమిళనాడుకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఇసుకడంప్

నగరి: మండలంలోని ముడిపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న హౌసింగ్ కాలనీ వద్ద తమిళనాడుకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఇసుక డంప్‌ను పోలీసులు శనివారం సీజ్ చేశారు. సీఐ మహేశ్వర్ తెలిపిన వివరాల మేరకు కుశస్థలి నది నుంచి కొందరు దొంగతనంగా ఇసుకను తరలించి ముడిపల్లి వెళ్లే మార్గంలోని ప్రభుత్వ స్థలంలో డంప్ చేశారు. అక్కడి నుంచి ఏడుగట్లు మార్గంలో తమిళనాడుకు తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. సమాచారం అందడంతో డంప్ చేసిన స్థలానికి వెళ్లి ఇసుకను సీజ్ చేశారు. స్థానిక వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమ రవాణా ఎవరు చేస్తున్నారో దర్యాప్తు చేస్తున్నామని త్వరలో వారిని అరెస్ట్ చేస్తామన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం నేతలు

నగరి: 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం తెలుగు అనువాద పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. నగరి పట్టణంలో నిర్వహించిన సంఘ సమావేశంలో సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.గోవింద స్వామి, జాతీయ ఉపాధ్యక్షుడు ఎంకే.ప్రకాష్ భారత రాజ్యాంగ తెలుగు అనువాద రచయిత, కో–ఆర్డినేటర్ వరుణ్ కుమార్ సమక్షంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారత రాజ్యాంగం స్వాతంత్రం, సమానత్వం తదితర విలువలతో కూడుకున్నదన్నారు. ప్రతి పౌరునికి సమాన హక్కులను కల్పించడమే రాజ్యాంగం ఉద్దేశమన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన దేశం కావడానికి, భారత రాజ్యాంగంలో ఉన్న విలువలే కారణమన్నారు. అయితే బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొద్దికొద్దిగా సవరణ పేరిట రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందన్నారు. ప్రతి పౌరుడు ఈ కుట్రను గ్రహించి రాజ్యాంగాన్ని పరి రక్షించుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం కర్ణాటక, ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు పుణ్యమూర్తి, కోదండరాం, మహిళా విభాగం అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు వేలాయుధం, మండల గౌరవ అధ్యక్షుడు బాలవర్ధన్ రాజు, అధ్యక్షుడు విజయ్‌చందర్, ఉపాధ్యక్షుడు మైల్ స్వామి, ఉమాపతి, ప్రధాన కార్యదర్శి తంగరాజు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


ట్రైనీ కలెక్టర్ హిమవంశీ నుంచి బహుమతి అందుకుంటున్న మీనాక్షి


బహుమతి అందుకుంటున్న హేమలత

పాలసముద్రం: జిల్లాస్థాయి చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో మండలానికి చెందిన విద్యార్థినులు ప్రతిభ చూపారని అధికారులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ విద్యార్థిని మహలక్ష్మి జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రథమస్థానం దక్కించుకుందని ఆ కళాశాల ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. అలాగే తిరుమలరాజుపురం హైస్కూల్ విద్యార్థిని మీనాక్షి జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రథమస్థానం కైవసం చేసుకుందని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ చేతుల మీదుగా విద్యార్థినులు అవార్డులు అందుకున్నారన్నారు.

బెల్టు షాపులు తొలగించండి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చక్రపాణి

వడమాలపేట (విజయపురం): గ్రామీణ ప్రాంతాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై దృష్టి సారించి, వాటిని అరికట్టాలని సర్పంచ్, ఎంపీటీసీలు కోరారు. శనివారం వడమాలపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుధ్య పనులు మెరుగు పరచాలని, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో కొందరు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఎస్‌వీ పురం రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టి, తిరుపతి నుంచి పుత్తూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సులను వడమాలపేట మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో 108, 104 వాహనం రావడానికి కష్టంగా ఉందని డాక్టర్ చక్రపాణి అన్నారు. ఎంపీడీఓ శేషగిరిరావు, తహసీల్దార్ జరీనా పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘం ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. చిత్తూరు వాసులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే వైఎస్‌ఆర్ సీపీ నేత అరెస్టు

వెదురుకుప్పం: రెండు వర్గాలు ఘర్షణ పడుతుండగా సర్ది చెప్పడానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకుడిపై అన్యాయంగా కేసులు బనాయించి అరెస్టు చేసి, హింసించడం భావ్యం కాదని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని మాంబేడు గ్రామంలో ఈ నెల 17వ తేదీన రెండు వర్గాలు ఘర్షణ పడుతుండగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి ఇరు వర్గాలను సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. ఈ ఘర్షణపై ఓ వర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముగ్గురిని అరెస్టు చేశారు. అయితే ఆ గొడవలకు ఎలాంటి సంబంధం లేకున్నా బండి గోవర్ధన్‌రెడ్డిని కూడా ఆ కేసులో ఇరికించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆ కేసులో శనివారం ఆయన్ని అరెస్టు చేశారు. నగరి డీఎస్పీ కార్యాలయంలో ఉన్న గోవర్ధన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, పార్టీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి రామయ్య, మాంబేడు ఎంపీటీసీ సభ్యుడు గుణశేఖర్, మాజీ సర్పంచ్‌లు బాలకృష్ణారెడ్డి, హేమశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రోశిరెడ్డి, నాయకులు జగదీశ్‌రెడ్డి, వెంకటాచలం పరామర్శించారు. ఈ సందర్భంగా బండి హేమసుందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గోవర్ధన్‌రెడ్డిని ఏ4 నిందితుడిగా చేర్చి 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయడం రాజకీయ కక్షతోనేనని విమర్శించారు. సర్దుబాటు చేసేందుకు ప్రయత్నించిన నాయకుడిపై కూడా కేసు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు.

యాంత్రీకరణతో తక్కువ పెట్టుబడి


వరి నాట్లను పరిశీలిస్తున్న ఏఓ హేమలత

కార్వేటినగరం: వ్యవసాయం యాంత్రీకరణతో పెట్టుబడి తగ్గించుకోవచ్చని ఏఓ హేమలత తెలిపారు. శనివారం ఆర్కేవీబీపేటలో రైతు శ్రీహరి వ్యవసాయ పొలంలో యంత్ర సాయంతో వేస్తున్న వేసిన వరి నాట్లను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ కూలీల సమస్యను అధిగమించేందుకు యాంత్రీకరణ ఉపయోగపడుతుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణం సాగు చేసుకోవచ్చని సూచించారు. అలాగే దుక్కి దున్నేందుకు రోటావేటర్లు, వరి విత్తడానికి డ్రమ్ సీడర్లు కూడా అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అనంతరం వరినాట్లు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి గాయత్రి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు రాము

పుత్తూరు: మండల పరిధిలోని తడుకు గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు మృతుడు తిరుపతి వైపు వెళుతున్న ట్రాక్టర్‌ను మోటార్ సైకిల్‌పై వెళ్తూ వెనక నుంచి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. మృతుడు నారాయణవనం మండలం సముదాయం గ్రామానికి చెందిన రాము(40)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య సాధన


శ్రీరంగరాజపురంలో..


నగరిలో మానవ హారం

నగరి: ప్రజాస్వామ్యం ఓటుతోనే సాధ్యమని ఆర్డీఓ భవానీ శంకరి అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని రెవెన్యూ సిబ్బంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బస్టాండు ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి మానవ హారం ఏర్పాటుచేశారు. అనంతరం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతను తెలిపే వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సీనియర్ ఓటర్లను, కొత్తగా ఓటు వచ్చినవారిని సత్కరించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఓటు హక్కును బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఓటు ఆవశ్యకతను అందరికీ వివరించారు. రాజులు, నవాబుల పాలనకు స్వస్తి పలికి ప్రస్తుతం ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నుకునే ప్రజాస్వామ్య పాలనకు వచ్చామని తెలిపారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందన్నారు. ఓటరు గుర్తింపు కార్డును ఆధార్‌తో ప్రతి ఒక్కరూ అనుసంధానం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 224 పోలింగ్ కేంద్రాలు ఉండగా 66 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఓటు నమోదుతోపాటు ఓటు వేయడం కూడా ఓటరు కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సీఐ మహేశ్వర్, ఆర్ఐ, వీఆర్‌ఓలు, డిగ్రీ కళాశాల సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, బూత్‌లెవల్ ఏజంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

పుత్తూరు: ప్రజాదరణ పొందలేని ప్రభుత్వాలను అధికారం నుంచి దించగలిగిన వజ్రాయుధమే ఓటు హక్కు అని స్థానిక తహసీల్దార్ జి.సి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత ఆలోచనా విధానంపై ఆధారపడి ఉందన్నారు. అలాంటి యువత ఎన్నికల్లో కుల, మత, వర్గ, ప్రాంత, ధనం తదితర ప్రలోభాలకు లోనుకాకుండా జనరంజకమైన ప్రభుత్వాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యావంతులే ఎక్కువ శాతం తమ ఓటు హక్కును వినియోగించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం ఓటరు నమోదు ఆన్‌లైన్ ద్వారా సులభతరంగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటుపై అవగాహన, చైతన్యం తీసుకురావడం కోసమే జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి, అధ్యాపకులు నాగేశ్వరరావు, నరసింహులు, శ్రీనివాసులు, వాణిశ్రీ, మన్యం నరసింహులు, వెంకటేశన్, వాసవి, పద్మావతి, శ్రీదేవి, వరలక్ష్మి, గాయత్రి, కోటేశ్వరరావు, వసంత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

కార్వేటినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుడికి వజ్రాయుధమని, రాజ్యాంగం మనకు కల్పించిన అదృష్టంగా యువత భావించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని కోరారు. అనంతరం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. అలాగే జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకున్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గాయత్రీదేవీ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ యూనిట్ అధికారి ధనుంజయరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యంఆచారి, అధ్యాపకులు రఘురాం, కార్తీక్, సరిత, జోగిప్రసాద్, విశ్వనాథరెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ కిరణ్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, మునిశేఖర్ పాల్గొన్నారు.

పెనుమూరు (కార్వేటినగరం): పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు దినోత్సవం నిర్వహించారు. ర్యాలీ చేపట్టి మానవహారంగా ఏర్పడ్డారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ శారద, అధ్యాపకులు మురుగన్, ఉమాపతి, ఆంజనేయులు, మధు, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

పాలసముద్రం: ఓటరు దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ అరుణకుమారి, స్థానిక కళాశాల ప్రిన్సిపల్ హేమలత ఆధ్వర్యంలో సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. సీనియర్ సిటిజన్‌లకు సత్కారం చేశారు.

కార్వేటిగరం(శ్రీరంగరాజపురం): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ లోకనాథపిళ్లై మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఎస్ఐ సుమన్, ఎంఈఓ అరుణాచలంరెడ్డి, సబర్మతి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్‌లను ఘనంగా సన్మానించారు. డీటీ కోమల, కార్యదర్శి సాయిభవానీ, ప్రధానోపాధ్యాయుడు సిద్ధయ్య పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవ మానవహారం

పుత్తూరు: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని పుత్తూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో వివిధ కళాశాలల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవ హారంగా ఏర్పడి ఓటు విలువపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ తిరుమలరాజు పాల్గొన్నారు.


పుత్తూరు: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు


పెనుమూరులో ఓటర్ డే ప్రతిజ్ఞ


పాలసముద్రం: సీనియర్ సిటిజన్‌లను సత్కరిస్తున్న తహసీల్దార్


పుత్తూరు: విద్యార్థుల మానవహారం

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సహోద్యోగుల నివాళి


భూపాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, పాలకవర్గ సభ్యులు

నగరి: నగరి మున్సిపాలిటీలో పనిచేస్తూ ఆరోగ్య సమస్యలతో పదవీ విరమణ పొందిన పి.భూపాల్ అనే శానిటరీ ఇన్‌స్పెక్టర్ శుక్రవారం సాయంత్రం మృతిచెందారు. ఆయన మృతికి నగరి మున్సిపల్ కార్యాలయ అధికారులు, పాలకవర్గ సభ్యులు నివాళులర్పించారు. కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మృతి చెందిన భూపాల్ ఫొటో ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నప్పుడు ఆయన అందరితో ఆయన మెలిగిన తీరును నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ ఎస్.బాలన్, కమిషనర్ కృష్ణారెడ్డి, పురపాలక సిబ్బంది తదితరులు నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

